W W W.EPAPER.MAHADAILY.COM
మహా పత్రిక
ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం
16-11-2025



## బీఆర్ఎస్ ఆధ్వర్యంలో 19న ఆందోళనకు పిలుపు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా రహదారులు దెబ్బతిని అధ్వాన స్థితికి చేరుకున్న నేపథ్యంలో ఈ నెల 19న అన్ని మండల కార్యాలయాల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు వినతిపత్రాలు అందజేయాలని జిల్లా అధ్యక్షుడు రేగ కాంతారావు పిలుపునిచ్చారు.

09

# బుగ్గవాగుతో సాగునీరు

## పచ్చని పంటలతో సస్యశ్యామలం అవ్వాలి

- మంత్రి తుమ్మల నాగేశ్వర రావు
- ఇతర పంటల కంటే రైతులకు పామాయిల్ పంటతో ఆదాయం ఎక్కువ
- రఘునాథపాలెం మండలం మంచుకొండలో రైతుబజార్‌ను ప్రారంభించిన మంత్రి తుమ్మల



ఖమ్మం,మహా

ఇతర పంటల సాగుకు ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ సాగు చేపట్టాలని, ఆయిల్ పామ్ సాగుతో రైతులకు మంచి ఆదాయం వస్తుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. శనివారం మంత్రి తుమ్మల నాగేశ్వర రావు రఘునాథపాలెం మండలంలో పర్యటించారు. మంచుకొండ గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతుబజార్ కూరాగాయల మార్కెట్ ను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమీషనర్ సునీల్ దత్ లతో కలిసి ప్రారంభించారు. రైతుబజార్ లో మహిళా రైతులతో మంత్రి ముచ్చటిస్తూ తాజా ఆకుకూరలు, వివిధ రకాల కూరగాయలను నాణ్యమైనవి అమ్ముకోవాలని, మీరు పండించిన వాటిని నేరుగా సరసమైన ధరకే విక్రయించాలని, కొనేవారికి, మీకు నష్టం రాకుండా చూసుకోవాలని సూచించారు.

## మంచి పనులు చేయడమే తన బాధ్యత

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ మళ్లీ మంత్రిగా అవకాశం కల్పించిన ప్రజలకు మంచి పనులు చేయడమే తన బాధ్యత అని అన్నారు. ఉమ్మడి జిల్లాలలో అన్ని మండలాల్లో పంటలకు సాగునీరు అవకాశాలు కల్పించానని, ఇక రఘునాథపాలెం మండలం కు రాబోయే రోజులో 100 కోట్ల నిధులు తెచ్చి ప్రజల సహాకారంతో పంటలతో పచ్చబడే మండలంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. గోదావరి నీళ్లు సీతారామ ద్వారా, బుగ్గవాగు తో రైతుల పంటలు సస్యశ్యామలం అవుతాయని అన్నారు.

09



05

## యువత ముందుకు రావాలి


స్థానిక భక్త రామదాస్ కళాక్షేత్రంలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ మరియు యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వందేమాతరంప150 కార్యక్రమంలో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురాం రెడ్డి , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తుమ్మల యుగేందర్ పాల్గొన్నారు .



04

## అరిగోస

నీరు అంటే జీవం. నీరు అంటే ఆశ. నీరు అంటే మనిషి బతుకు. కానీ ఖమ్మం జిల్లాలోని కేసిరెడ్డిపల్లి, కచవరం, కొత్తపాలెం వంటి ఆరు గ్రామాల ప్రజలకు మాత్రం నీరు ఒక నిత్య పోరాటంగా, ఒక ఆవేదనగా మారిపోయింది. ఇంటింటికీ ప్రవహించాల్సిన మిషన్ భగీరథ సురక్షిత నీరు ఏడాది నుంచి రావడం లేదు.



08

## ఆదివాసీ హక్కుల సాధనలో అగ్రగామి

గిరిజన యోధుడు, స్వాతంత్ర్య సమరయోధుడు భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా ఆయన పోరాట స్ఫూర్తిని ఖమ్మం లో స్మరించుకుంది. ఆదివాసీ హక్కుల సాధనలో బిర్సా ముండా అగ్రగామిగా నిలిచారని, ఆయన జీవితం యావత్ దేశానికి ఆదర్శప్రాయమని బిజెపి జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు పేర్కొన్నారు.

# పరిసరాల పరిశుభ్రతతో మెరుగైన ఆరోగ్యం

**రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు**

**నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రతి ఒక్కరు పాటుపడాలి**

**ఖమ్మం లకారం ట్యాంక్ బండ్ లో చేప పిల్లలను విడుదల చేసిన మంత్రి తుమ్మల**







**ఖమ్మం,మహా:** పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం మెరుగుగా ఉంటుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. మంత్రి శనివారం ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని లకారం ట్యాంక్ బండ్ లో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమీషనర్ సునీల్ దత్ లతో కలిసి చేప పిల్లలను విడుదల చేసారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ ఖమ్మం నగరంలో అంతర్గతంగా పారిశుద్ధ్య నిర్వహణ మరింత మెరుగ్గా ఉండాల్సిన అవసరం ఉందని, పారిశుద్ధ్య నిర్వహణలో స్థానిక ప్రజాప్రతినిధులు పూర్తి స్థాయిలో భాగస్వామ్యం కావాలని అన్నారు. గోల్లపాడు ఛానల్, లకారం చెరువు, డంపు యార్డ్, కలెక్టరేట్, బస్టాండ్ పరిస్థితులను అప్పటి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని వెళ్లి అవసరమైన నిధులు మంజూరు చేసుకుని బాగు చేయడం జరిగిందని అన్నారు. రోడ్ల విస్తరణకు ప్రజలు సహకరించాలని, రోడ్ల విస్తరణతో అభివృద్ధి వేగంగా జరుగుతుందని, వ్యాపారాలు బాగుపడతాయని అన్నారు.లకారం చెరువు బాగు చేస్తే ఖమ్మం నగర ప్రజలకు సాయంత్రం సమయంలో ఆహ్లాదంగా గడిపేందుకు ఒక వేదిక దొరికిందని అన్నారు. వెలుగుమట్ల అర్బన్ పార్క్ ను సైతం అభివృద్ధి చేస్తామని అన్నారు. ప్లాస్టిక్, చెత్త మురికి కాలువలో వేయడం ద్వారా దోమలు వ్యాప్తి చెంది, మన పిల్లలకే డెంగ్యూ వంటి రోగాలు వస్తున్నాయని, మన సంపాదన మొత్తం ఆస్పత్రుల పాలు అవుతున్నదని అన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచి, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని మంత్రి తెలిపారు. మన పిల్లలను బాగా చదివించుకోవాలని, ఇక్కడ మంచి రెసిడెన్షియల్ పాఠశాలలు, వైద్య, ఇంజనీరింగ్ కళాశాలలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఖమ్మం ఖిల్లాకు రోప్ వే నిర్మాణం చేస్తున్నామని అన్నారు. ధంసలాపురంకు మురుగునీరు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ లకారం ట్యాంక్ బండ్ లో మంత్రి చేతుల మీదుగా చేప పిల్లలు విడుదల చేయడం సంతోషంగా ఉందని అన్నారు. మత్సకారులకు ఉపయోగపడే విధంగా ప్రభుత్వం 100 శాతం సబ్సిడీతో చేప పిల్లలు విడుదల చేస్తుందని అన్నారు. లకారం లో 82500 చేప పిల్లలను విడుదల చేసినట్లు తెలిపారు.ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 3.5 కోట్ల చేప పిల్లలను నీటి వనరుల్లో 224 మత్స్యకార సహకార సంఘాల ఆధ్వర్యంలో విడుదల చేస్తున్నామని తెలిపారు. చెరువులో విడుదల చేసే చేప పిల్లలకు సరైన సమయంలో ఫీడ్ అందే విధంగా చూడాలని, నీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు పాటించాలని, ఖమ్మం నియోజక వర్గం పరిధిలో 17 లక్షల చేప పిల్లలను ఉచితంగా విడుదల చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. చేప పిల్లల విడుదల కార్యక్రమం ద్వారా మార్కెట్లో చేపల లభ్యత పెరుగుతుందని, ప్రజలకు మంచి ప్రోటీన్ ఫుడ్ అందుతుందని, దీనిని పూర్తిస్థాయిలో వినియోగించుకుంటూ మత్స్యకార సహకార సంఘాలు ఎదగాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఇంచార్జ్ మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్ డా. పి. శ్రీజ, డిసిసిబి చైర్మన్ దొండపాటి వెంకటేశ్వర రావు, స్థానిక కార్పొరేటర్ కృష్ణ, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, శివప్రసాద్ పాల్గొన్నారు.

## మంత్రి తుమ్మల జన్మదిన వేడుకలలో నేత్ర పరీక్షలు

**కల్లూరు, మహా:** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జన్మదిన వేడుకలు కల్లూరు టీ.టీ.డీ కళ్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ హాజరై మండల కార్యకర్తలతో కలిసి భారీ కేకును కట్ చేసి మంత్రి తుమ్మలకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకలలో కను దృష్టి మందగించిన వారికి శంకర నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి కళ్ళజోళ్ళు అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ విజయకుమార్ మాట్లాడుతూ ఉమ్మడి తెలంగాణ అభివృద్ధి ప్రదాత, పేద ప్రజల ఆశాజ్యోతి, వివిధ రాజకీయ పార్టీలలో మంత్రి పదవి అలంకరించి పదవితో ప్రజల కష్టాలను తీర్చిన కృషివళుడు తుమ్మల నాగేశ్వరరావు 72వ జన్మదిన వేడుకలు జరుపుకోవాలని ఆనందంగా ఉందని, ఇటువంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఎల్లవేళలా సుఖ సంతోషాలతో తులతూగాలని ఆకాంక్షించారు. ఈ



కార్యక్రమంలో కల్లూరు ఏ.ఎం.సీ చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్, పసుమర్తి చంద్రరావు, సత్తుపల్లి ఏ.ఎం.సీ చైర్మన్ దోమ ఆనంద్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఆలకుంట నరసింహారావు, కల్లూరు మండలం నాయకులు పాల్గొన్నారు.

## ధాన్యం పెండింగ్ బోనస్ చెల్లించాలి



**నెలకొండపల్లి, మహా:** గత యాసంగిలో రైతులు సాగుచేసిన ధాన్యానికి ఇవ్వాల్సిన పెండింగ్ బోనస్ను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని సిపిఐ(ఎం) పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సిపిఐ(ఎం) కార్యాలయం రావెళ్ల సత్యనారాయణ భవనంలో పార్టీ మండల జనరల్ బాడీ సమావేశం రచ్చ నరసింహారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత యాసంగిలో రైతులు సాగు చేసిన ధాన్యానికి క్వింటాకు 500 రూపాయల బోనస్ను చెల్లించకుండా ప్రస్తుత ఖరీఫ్ సీజన్ ధాన్యానికి బోనస్ చెల్లిస్తామని చెప్పడం రైతులను మోసం చేయడమే అన్నారు. ఏడాది గడుస్తున్నా పెండింగ్ బోనస్ ను చెల్లించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇటీవల మొంతా తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న వరి పంటకు ఎకరానికి 40 వేల రూపాయలు, పత్తి పంటకు 30 వేల రూపాయల పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై పార్టీ కార్యకర్తలు అధ్యయనం చేయడంతో పాటు ప్రజలను చైతన్యవంతం చేసి పోరాటాలను రూపొందించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కేవీ రామిరెడ్డి, నాయకులు ఏటుకూరి రామారావు, భూక్య కృష్ణ, పగిడికత్తుల నాగేశ్వరరావు, కట్టెకోల వెంకటేశ్వర్లు, మందడపు మురళీకృష్ణ, దేగల వెంకటేశ్వరరావు, శీలం అప్పారావు, బలుసు ప్రమీల, పొన్నం శివరాజు, గురజాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ఇందిరా మహిళా డెయిరీ లబ్దిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలి



**ఖమ్మం,మహా:** ఇందిరా మహిళా డెయిరీ నిర్వహణకు లబ్ధిదారుల ఎంపిక పూర్తి పారదర్శకంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జిల్లా కలెక్టర్, కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో ఇందిరా మహిళా డెయిరీ రెండవ విడత లబ్ధిదారుల ఎంపిక, నిర్వహణపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ తో కలిసి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ మహిళా డెయిరీ మెరుగ్గా నిర్వహించేందుకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, మేనేజర్ లుగా ఎంబీఏ అభ్యర్థులను ఔట్ సోర్సింగ్ విధానంలో నియమించేందుకు వీలుగా అడ్మిన్ బడ్జెట్ ప్రతిపాదనలు తయారు చేయాలని అన్నారు. భవిష్యత్తులో 5 వేల మంది లబ్ధిదారులకు 2 పశువుల చొప్పున 10 వేల పశువులు పంపిణీ చేసే నేపథ్యంలో దానికి అనుగుణంగా పాల కొనుగోలు, విక్రయం వంటి పనులను పర్యవేక్షించేందుకు కట్టుదిట్టమైన మేనేజ్మెంట్ సిద్ధం చేయాలని అన్నారు. లబ్ధిదారుల ఎంపికలో ఎంపిడిఓలు జాగ్రత్తలు పాటించాలని, మనం సబ్సిడీ క్రింద అందించే పశువుల యూనిట్లు, ఇతర పరికరాలు ఎట్టి పరిస్థితుల్లో అమ్ముకునేందుకు, దుర్వినియోగంకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లో ఒత్తిడిలు పట్టించుకోవద్దని, నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని అన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల పనులను పర్యవేక్షించిన కాంగ్రెస్ నేతలు



**మణుగూరు, మహా:** మణుగూరు మండలం సమితి సింగారం గ్రామపంచాయతీ పరిధిలోని అశోక్నగర్ గ్రామంలో తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్టాత్మక సంక్షేమ పథకం ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పినపాక నియోజకవర్గంలో పార్టీలకతీతంగా అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు, ఇతర సంక్షేమ పథకాలు ఎటువంటి వివక్ష లేకుండా అందజేయడంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సేవలు అమూల్యమని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధి ప్రథమ ప్రాధాన్యంగా పెట్టుకున్న పాయం వెంకటేశ్వర్లు పారిశ్రామిక, సాంకేతిక, మౌలిక వసతులు సహా అన్ని రంగాల్లో ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నారని నాయకులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. అదే సమయంలో సంక్షేమ పథకాల అమలులో అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా పేదవారికి అందజేస్తున్న గొప్ప మనసున్న ప్రజానాయకుడు పాయం అని కొనియాడారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు గాండ్ల సురేష్, బొజ్జా త్రిమూర్తులు, ఎండి యాకూబ్ అలీ, పద్మాల సత్యనారాయణ, దాసరి కృష్ణ, కొల పిన్ని మానస, గద్దల ఆదిలక్ష్మి, దాసరి పార్వతి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం

- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో విజయంతో పార్టీ నాయకుల్లో పట్టరాని సంతోషం
- ఇదే ఉత్సాహంతో స్థానిక ఎన్నికలకు సిద్ధమవుతున్న శ్రేణులు

**కూసుమంచి, మహా:** తెలంగాణలో కాంగ్రెస్ ఇక కష్టం..ప్రజల్లో వ్యతిరేకత వచ్చింది.. కాంగ్రెస్ గెలవదు.. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ కు ఓటమి ఖాయం అని అంటూ కొందరు చేస్తున్న ప్రచారానికి జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సమాధానమైంది.. జూబ్లీహిల్స్ లో భారీ మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ అద్భుతమైన విజయం సాధించడంతో రాష్ట్రంలో కాంగ్రెస్ కు తిరుగులేదు అనే ప్రచారం ప్రారంభమైంది.. గేటర్ లో కాంగ్రెస్ పార్టే లేని చోట ఘన విజయం సాధించడంతో కాంగ్రెస్ పార్టీ విమర్శకుల ప్రశంసలు అందుకుంటోంది. అంతే కాకుండా ఈ గెలుపుతో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్తేజం, ఉత్సహం వచ్చినట్లైంది.. ఉప ఎన్నిక విజయంతో రాష్ట్ర వ్యాప్తంగా సంబురాలు చేసుకుంటున్నారు. మరీ ముఖ్యంగా ఖమ్మం జిల్లా, పాలేరు నియోజకర్గం వ్యాప్తంగా ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. కూసుమంచి, నేలకొండపల్లి, ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం మండలంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు విజయోత్సవ సంబరాలు చేశారు. భారీ మోటర్ సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. టపాసులు కాల్చి,



స్వీట్లు పంపిణి చేసుకున్నారు. నేలకొండపల్లి మండలంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు కాంగ్రెస్ పాటలకు డ్యాన్సులు చేశారు.

### నూతన ఉత్సహంతో ఉన్న కాంగ్రెస్ శ్రేణులు

కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వచ్చిన చాలా రోజుల తరువాత కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్తేజం కనిపిస్తోంది.. ప్రభుత్వం వచ్చిన కొద్ది నెలల పాటు ఉల్లసంగా, ఉత్సహంగా కనిపించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆ



తరువాత రాష్ట్ర అర్థిక పరిస్థితి కారణంగా కొన్ని పథకాల్లో నెలకొన్న చిన్నచిన్న సమస్యలు కారణంగా పార్టీ శ్రేణుల్లో నైరాస కనిపించింది. కానీ చాలా రోజుల తరువాత జూబ్లీహిల్స్ లో వచ్చిన భారీ మేజారిటీతో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో చాలా ఉత్తేజం కనిపిస్తోంది. ఎక్కడ చూసిన కాంగ్రెస్ పార్టీ జెండా, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కనిపిస్తున్నారు. జూబ్లీహిల్స్ ఎన్నిక, అధికార, ప్రతిపక్ష పార్టీల భవిష్యత్తుపై చర్చించుకుంటున్నారు. చాలా గ్రామాలోలో కాంగ్రెస్ పార్టీ పై పాజిటీవ్ నినాదం పెరిగింది.

### అదే ఊపుతో స్థానిక ఎన్నికలకు..

జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మంచి ఊపుమీద ఉన్నారు. బీజేపీకి డిపాజిట్ రాకపోవడం, సిట్టింగ్ సీటులో బీఆర్ఎస్ ఘోర పరాజయం పాలవడంతో కాంగ్రెస్ కు తిరుగులేదని భావిస్తున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, రాబోయే స్థానిక ఎన్నికల్లో కూడా అదే ఊపుతో ముందుకు వెళ్లే అవకాశం కనిపిస్తోంది. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో కూడా అధికార పార్టీకి ఎదురు ఉండదని భావిస్తున్న పార్టీ శ్రేణులు మరింత ఉత్సహంగా పనిచేసే అవకాశం కనిపిస్తోంది.

## భగవాన్ బిర్సా ముండా ఆదివాసీ హక్కుల సాధనలో అగ్రగామిగా నిలిచారు





**ఖమ్మం, మహా:** భగవాన్ బిర్సా ముండా ఆదివాసీ హక్కుల సాధనలో అగ్రగామిగా నిలిచారని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు. ఖమ్మం గొల్లగూడెం ఏజీహెచ్ఎస్ లో భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని, బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ బిర్సా ముండా 19వ శతాబ్దపు చివరిలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ఉల్గులాన్ ఉద్యమానికి నాయకత్వం వహించారని, 1875 నవంబర్ 15న జార?ండ్ రాష్ట్రంలోని ఉలిహతు గ్రామంలో జన్మించి, ప్రజల హక్కుల కోసం తన జీవితాన్ని అంకితం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డీడీ విజయలక్ష్మి, ఖమ్మం, వైరా ఏటిడిఓలు, ఏసీఎంఓ., ఎస్సిఆర్పి, పాఠశాల హెడ్మాస్టర్, ఉపాధ్యాయ బృందం, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## శివాలయాన్ని దర్శించుకున్న మంత్రి తుమ్మల



**సత్తుపల్లి, మహా:** పట్టణ పరిధిలోని గుడిపాడు సమీపంలో కొలువై ఉన్న దుర్గా పార్వతీ సహిత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయాన్ని శుక్రవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల ప్రత్యేక పూజలు, దీపాలంకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మంత్రి తుమ్మలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మార్కెటింగ్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్, కొల్లి నరసింహారావు, చల్లగుల్ల కృష్ణయ్య, నున్న రత్నాకర్, గాదె చెన్నారావు పాల్గొన్నారు.

## ఘనంగా జన జాతీయ గౌరవ దివాస్ వేడుక

**జూలూరుపాడు, మహా:** ఆదివాసీల హక్కుల కోసం, తెల్లవాడి ఆకృత్యాలకు, మతమార్పిడి ముఠాలకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప స్వతంత్ర సమరయోధుడు, ఆదివాసీల ఆరాధ్యుడు, భగవాన్ బిర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకొని శనివారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ అజయ్ ఆధ్వర్యంలో జన జాతీయ గౌరవ దివాస్ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిర్సా ముండా చిత్రపటానికి పూలమాల లేసి ఘన నివాళులర్పించారు. ఆదివాసి హక్కుల కోసం, గిరిజన తెగలపై జరుగుతున్న ఆకృత్యాలను, మిషనరీలు, భూస్వాములకు, వ్యతిరేకంగా ఆదిమా తెగలను ఏకం చేసి, విప్లవ ఉద్యమాలను నడిపి ఆంగ్లేయుల వెన్నులో వణుకు పుట్టించిన ఆదివాసీల ఆరాధ్యుడు భగవాన్ బీర్సా ముండా స్వతంత్ర ఉద్యమ చరిత్రను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ తులసిరాం, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## దేవరకొండలో నేషనల్ కరాటే పోటీలు

### సత్తా చాటిన మణుగూరు విద్యార్థులు

**మణుగూరు, మహా :** నల్గొండలో జిల్లా దేవరకొండలో జరిగిన నేషనల్ కరాటే ఛాంపియన్షిప్ పోటీలో మణుగూరు విద్యార్థులు ప్రతిభ చూపి పతకాలు సాధించారు. ఈ ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో మణుగూరులోని లేడి సీనియర్ కరాటే మాస్టర్ కాశిమల్ల పద్మ పోటీలకు సంబంధించిన వివరాలు తెలిపారు. బ్లాక్ బెల్ట్ కటా బాలికల విభాగంలో గూగులోత్ రిషిక బంగారు పతకం సాధించిందని, బ్రౌన్ టెస్ట్ బాలుర విభాగంలో నామా విగ్నేష్ బంగారు పతకంతో మెరిశాడని తెలిపారు. బ్లూ బెల్ట్ బాలికల విభాగంలో గుగులోత్ ధృవిక బంగారు పతకం, వైట్ బెల్ట్ బాలికల విభాగంలో గంగాపురి సాత్విక ద్వితీయ పతకాన్ని కైవసం చేసుకుందన్నారు. అలాగే గ్రేస్ మిషన్ స్కూల్ విద్యార్థులు విశాల్ వర్మ, ఆదిత్యదొర, గౌతమ్, ఇస్సాక్, శ్రీనిశాంత్, నాగ విగ్నేష్లు బంగారు, వెండి, బ్రాంజ్ మెడల్స్ సాధించారన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి పథకాలు సాధించిన విద్యార్థులను, మాస్టర్ కాశిమల్ల పద్మను అభినందించారు. కరాటే ఆడపిల్లలకు ఆత్మరక్షణలో దోహదపడుతుందని ప్రతి ఒక్క అమ్మాయి కరాటే నేర్చుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.



# జీవనశైలిలో స్వల్ప మార్పులతో మధుమేహం నియంత్రణ

**ఖమ్మం,మహా.:** మానవ జీవనశైలిలో స్వల్ప మార్పులతో మధుమేహం నియంత్రణ సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్ లో ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా మధుమేహం – ఆరోగ్యకరమైన జీవన శైలిపై నిర్వహించిన అవగాహన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ మధుమేహం సైలెంట్ కిల్లర్ లాంటిదని, దీని నుంచి చిన్న, చిన్న జాగ్రత్తలు పాటించి మనల్ని, మన సన్నిహితులను కాపాడుకోవచ్చని అన్నారు. షుగర్ ను నిర్లక్ష్యం చేస్తే గుండె సంబంధిత వ్యాధులు, కిడ్నీ ఫెయిల్యూర్ వంటి తీవ్రమైన సమస్యలు వస్తాయని, షుగర్ శరీరంలో అన్ని అవయవాలను పాడు చేస్తుందని అన్నారు. ప్రతిరోజు కనీసం అరగంట సమయం నడకకు కేటాయించాలని కలెక్టర్ సూచించారు. షుగర్ నియంత్రణకు వైట్ రైస్ స్వీకరణ తగ్గించాలని, మన ఆహారంలో ఫ్రై ఐటెమ్స్ లేకుండా చూసుకోవాలని, మన పూర్వీకులు తినే రాగులు, జొన్నలు, చిరు ధాన్యాలు ఆహారంలో భాగం చేసుకోవాలని అన్నారు. చిన్నపిల్లల్లో





కూడా మధుమేహం వస్తుందని, పిల్లలు ఎక్కువగా ఫోన్ వాడకుండా ఔట్ డోర్ గేమ్స్ ఎక్కువ ఆడాలని అన్నారు. దైనందిన జీవితంలో మనం చేసే స్వల్ప మార్పులతో మన ఆరోగ్యం బాగు పడుతుందని, భవిష్యత్తులో డయాలసిస్, గుండె సంబంధిత చికిత్సలు చేసుకోవాల్సిన అవసరం ఉండదని అన్నారు. ప్రజలు రెగ్యులర్ గా షుగర్, బీపి చెక్ చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ రామారావు మాట్లాడుతూ మధుమేహం వ్యాధి నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలలో అవగాహన కల్పించేందుకు అవగాహన ర్యాలీ నిర్వహించామని అన్నారు. ఖమ్మం జిల్లాలో 55 వేల 829 మంది షుగర్ పేషెంట్ లను గుర్తించి మందులు ప్రతి నెలా పంపిణీ చేస్తున్నామని అన్నారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ చందు నాయక్ మాట్లాడుతూ మధుమేహం వచ్చిన 100 మందిలో 50 మంది నిర్ధారణ కాకపోవడం, తగిన జాగ్రత్తలు మందులు వాడకపోవడం వల్ల తీవ్రంగా ఆరోగ్యం దెబ్బతింటున్నారని అన్నారు. మన ఆహార అలవాట్లు మార్చుకొని షుగర్ వ్యాధి నియంత్రించే అవకాశం ఉంటుందని అన్నారు. ప్రతి మండలంలో మధుమేహం పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని అన్నారు. ప్రతి రోజు ఉదయం కనీసం అరగంట సమయం వాకింగ్ చేయాలని, అన్నం తగ్గించాలని, చిరు ధాన్యాలు, కూరగాయలు ఎక్కువగా స్వీకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డి.సి.హెచ్.ఎస్. డాక్టర్ రాజశేఖర్, వైద్యాధికారులు డా. గణేష్, డా. సీతారాం, డా. వేణుగోపాల్, వైద్య కళాశాల విద్యార్థిని, విద్యార్థులు, ఫ్యాకల్టీ తదితరులు పాల్గొన్నారు.

## జుజ్జురి వెంకన్న బాబు బాధ్యతలు స్వీకరణ



**అశ్వారావుపేట/భద్రాద్రి, మహా :** జిల్లాలో ఖాళీగా ఉన్న మండల, పట్టణ స్థాయి పార్టీ పదవులతో కార్యకలాపాలు నిలకడగా సాగడంలో సమస్యలు ఏర్పడిన నేపథ్యంలో, అధిష్టానం సూచనల మేరకు అన్ని మండలాల్లో బాధ్యులను నియమిస్తున్నట్లు భారత రాష్ట్ర సమితి జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు ప్రకటించారు. అశ్వారావుపేట మండల పార్టీ అధ్యక్షుడిగా జుజ్జురి వెంకన్న బాబు ఏకగ్రీవంగా ఎన్నుకోబడినట్లు ఆయన ప్రెస్ నోట్ ద్వారా వెల్లడించారు. వెంకన్న బాబు మండలంలోని నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని జిల్లా పార్టీ ఆకాంక్ష వ్యక్తం చేసింది.

**రేగా కాంతారావు మాట్లాడుతూ..**

త్వరలోనే జిల్లాలోని మండల, పట్టణ అధ్యక్షులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, రాబోయే స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ చేపడతామని, ఏ ఎన్నిక వచ్చినా గెలుపే లక్ష్యంగా కష్టపడి పని చేయాలని, స్థానిక ఎన్నికల్లో విజయం సాధించే శాతం అధికంగా ఉన్న నాయకులకే టికెట్లు ఇవ్వబడతాయని, టిక్కెట్ల కోసం అభ్యర్థులు పైరవీలు చేయవద్దని సూచించారు. పోటీ చేయాలనే ఆసక్తి ఉన్నవారు తమ పూర్తి వివరాలు కలిగిన లేఖను నియోజకవర్గ ఇంచార్జిలకు, మండల–పట్టణ అధ్యక్షులకు లేదా జిల్లా పార్టీకి అందజేయాలని రేగా కాంతారావు కోరారు.

## శానిటరీ వర్కర్లకు రగ్గుల పంపిణీ



**అశ్వారావుపేట, మహా:** తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జన్మదినాన్ని పురస్కరించుకొని అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలోని శానిటరీ కార్మికులకు రగ్గుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 55 మంది శానిటరీ వర్కర్లు, సిబ్బందికి రగ్గులు అందజేశారు. తుమ్మల అభిమానులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కలిసి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. పట్టణ పరిశుభ్రత కోసం కష్టపడుతున్న కార్మికులను ప్రోత్సహించడానికి తీసుకున్న ఈ కార్యక్రమం మంచి స్పందన తెచ్చుకుంది. కార్యక్రమంలో మొగాళ్లపు చెన్నకేశవరావు, మున్సిపల్ కమిషనర్ బి. నాగరాజు, జేష్ఠ సత్యనారాయణ చౌదరి, జల్లిపల్లి దేవరాజు, సత్యవరపు బాలగంగధర్, బాణాలు నారాయణ, నార్లపాటి రాజశేఖర్, సీతారాం పాల్గొన్నారు.





# యువత ముందుకు రావాలి

### ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురాం రెడ్డి

### స్వదేశీ వస్తు వినియోగం తోటే దేశ అభివృద్ధి - తుమ్మల యుగేందర్

**ఖమ్మం, మహా:** స్థానిక భక్త రామదాస్ కళాక్షేత్రంలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ మరియు యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వందేమాతరంఏ150 కార్యక్రమంలో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురాం రెడ్డి , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తుమ్మల యుగేందర్ పాల్గొన్నారు . రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి యడ్లపల్లి సంతోష్ మరియు గ్లోబల్ ఫ్యామిలీ అధ్యక్షుడు సంజయ్ రెడ్డి ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహాత్మా గాంధీ 1156 విగ్రహాల ప్రదర్శన మరియు 156 చరకాల ప్రదర్శన నిర్వహించి , ఖమ్మం జిల్లా కళాశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీ విజేతలను సత్కరించారు . అలాగే భారతదేశ స్వతంత్రం మరియు వందేమాతర గీతం విశిష్టతను తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు . ఈ కార్యక్రమంలో పాల్గొన్న పార్లమెంట్ సభ్యులు రామసయం రఘురాం రెడ్డి మాట్లాడుతూ నేటి యువకులే రేపటి పౌరులు భారతదేశానికి అతి శక్తివంతమైన యువశక్తి ఉందని అన్నారు . యువత సరైన మార్గంలో మహాత్మా గాంధీ సూచించిన విధంగా సత్యం న్యాయం ధర్మం పాటిస్తూ చెడు అలవాట్లకు బానిసలు కాకుండా దేశ అభివృద్ధికి దోహదపడాలని యువతకు పిలుపునిచ్చారు . ఈ కార్యక్రమంలో పాల్గొన్న తుమ్మల యు గంధర్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ తన అభిప్రాయంలో ఈ దేశం నుండి బ్రిటిష్ వాళ్ళని పారితోలితే మనకు స్వతంత్రం వచ్చినట్టు కాదు వారు మనకి అలవర్చినటువంటి బ్రిటిష్ సంస్కృతిని ప్రారంభోలినాడే అసలైన భారత దేశ స్వతంత్రం వచ్చిందని తెలిపినట్టుగానే నేడు మహాత్మా గాంధీ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ స్వదేశీ వస్తు వినియోగించాలని పిలుపునిచ్చారు



## ఆహార నియమాలు పాటిస్తే మధుమేహాన్ని నియంత్రించొచ్చు



**కామేపల్లి మహా:** శారీరిక శ్రమ దృష్టి సారించి ఆహార నియమాలు పాటిస్తే మధుమేహ వ్యాధిని నియంత్రించొచ్చని మండల వైద్యాధికారిణి నెల్లూరు చందన పిలుపునిచ్చారు. ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా శనివారం కామేపల్లిమండల కేంద్రం లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైద్యశాలలో వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ మధుమేహం చాలా నిశ్శబ్దంగా ప్రారంభమవుతుందని అందుకే ప్రతి ఒక్కరు బ్లడ్ షుగర్ చెక్ చేయించుకోవాలని సూచించారు. మధుమేహ వ్యాధి వచ్చిన వారు భయపడాల్సిన పనిలేదని దానిని నియంత్రణలో ఉంచుకోవచ్చని అన్నారు.ప్రజల జీవనశైలి, ఆహారపు అలవాట్లు, శరీరక శ్రమ లేకపోవడం, మానసిక ఒత్తిడి వల్ల ఈ వ్యాధి రావడానికి ఆస్కారం ఉంటుందని వెల్లడించారు. తదుపరి వైద్యశాలలో ఏర్పాటుచేసిన క్యాంపులో 145 మందికి డయాబెటిక్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఈ వో కె వెంకటేశ్వర్లు, హెచ్ ఎస్ లు రాధాకృష్ణ ,నరేంద్ర నాయక్, స్టాఫ్ నర్స్ పుష్పలత, హెల్త్ అసిస్టెంట్లు తిరుమలయ్య, ఎస్ శ్రీనివాస్, రాంబాబు, మల్లికార్జున్ ,ఎ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## మొక్కజొన్న సాగుపై తప్పనిసరి అగ్రిమెంట్



**మధిర, మహా:** యాసంగి సీజన్‌కు గాను మొక్కజొన్న సాగు ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులు విత్తన ఏజెంట్లుతో అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య హెచ్చరించారు. శనివారం మధిరలో పర్యటించారు. ఈ సందర్భంగా పలు విత్తన దుకాణాల షాపులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ అగ్రిమెంట్ లేకుండా ఏ ఒక్క ఏజెంట్ నుంచి కూడా విత్తనాలు తీసుకోకూడదని స్పష్టం చేశారు. తప్పనిసరిగా లిఖితపూర్వక అగ్రిమెంట్ ఇవ్వడం–తీసుకోవడం ద్వారా భవిష్యత్తులో నష్టాలను నివారించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు తీసుకోవాల్సిన పన్నెండు ముఖ్య సూచనలను ఆయన వివరంగా వెల్లడించారు. విత్తనాలు కొనుగోలు చేసే ముందు ఏజెంట్ సమాచారాన్ని, ముఖ్యంగా స్థానికతను తెలుసుకోవడం చాలా అవసరం. లోకల్ ఏజెంట్ల ఇంటి చిరునామా, లొకేషన్ తెలిసి ఉండటం వలన ఏదైనా సమస్య తలెత్తితే తక్షణమే నిలదీయగలిగే అవకాశం ఉంటుందని అధికారి తెలిపారు. రైతు పొలంలో విత్తనాలు వేసే సమయంలో సంబంధిత కంపెనీ సిబ్బంది తప్పకుండా హాజరై విత్తనాలు వేపించాలని ఆయన సూచించారు.

## కమ్మ వారి కార్తీకమాస వన సమారాధనకు ఆహ్వానం



**టేకులపల్లి - మహా:** కొత్తగూడెం సెంట్రల్ పార్క్ లో జరిగే కమ్మవారి కార్తీక వన సమారాధనకు మండలంలోని కమ్మ కులస్తులు అందరు తరలిరావాలని కొత్తగూడెం కమ్మ సంఘ ప్రతినిధులు బిక్కసాని నాగేశ్వరరావు, మాచవరపు కోటేశ్వరరావు, కూచిపూడి జగన్ కోరారు. టేకులపల్లి కమ్మ సంఘం సభ్యులను శనివారం వారు కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కమ్మ సంఘం సభ్యులు గుడిపూడి సత్యనారాయణ, గుడిపూడి మోహన్ రావు, తోటకూరి నరసింహారావు, ఏలూరి రవి, నెల్లూరి సత్యం, జాలాది అప్పారావు, ఏపూరి సీతయ్య, మామిళ్ళపల్లి శ్రీనివాస్, రాయల అన్వేష్, కందుల వెంకటేశ్వర్లు, ఉన్నం దాసయ్య, తోటకూరి సతీష్, బొగ్గారపు అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## నవ మహిళా సాధికార కేంద్రంలో “సహకార” ఉత్సవాలు

**కొత్తగూడెం రూరల్, మహా:** నవ లిమిటెడ్ పాల్వంచ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమాలలో భాగంగా ఏర్పాటు చేసిన నవ మహిళా సాధికార కేంద్రంలో “72వ” అఖిలభారత సహకార ఉత్సవాలను నవ మహిళా పొదుపు పరస్పర సహకార సహకార సంఘం వారు శనివారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి అతిథులుగా వరంగల్ కే సి టి సి లెక్చరర్ పి.రాజయ్య, ఎస్ బి ఐ సీల్ బ్రాంచ్ మేనేజర్ భావ్ సింగ్, కో ఆపరేటివ్ సొసైటీ ఆడిటర్ వరుణ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముందుగా సహకార జెండాను ఎగురవేసి సహకార ఉద్యమ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా నవ మహిళా త్రిఫ్ట్ అధ్యక్షురాలు టి.అరుణ మాట్లాడుతూ ఈ సహకార సంఘం జనవరి 2018న ఏర్పాటు చేశామని ఇంతవరకు ఈ సొసైటీ సుమారు ఒక కోటికి పైగా తాటి ఆకుల బుట్టలు వివిధ రకాల దుస్తులు కుట్టడం ద్వారా ఆర్డర్లు సేకరించామని తెలిపారు.

# అరిగోస

- మూగజీవాలు ముట్టని నీటిని తాగుతున్న ప్రజలు
- ఉప్పునీటి తాగుడుకు బలి అవుతున్న గర్భిణీలు
- ప్రతీ ఇల్లు ఆవేదనతో నిండిన గ్రామం
- కేసిరెడ్డిపల్లిని కుదిపేస్తున్న తాగునీటి దుర్భిక్షం





### బాధను లాభంగా మార్చే స్వార్థం

తాగునీటి దుర్భిక్షాన్ని అవకాశంగా తీసుకుని కొందరు వ్యక్తులు బోర్లు పెట్టి అధిక ధరలు వసూలు చేస్తున్నారు. రాత్రింబవళ్లు నీటి కోసం తిరిగే జనాలకు ఇది అదనపు భారం. “ఇంట్లో చిన్నపిల్లలు ఉన్నారు. ఎంత ఖరీదు అయినా సరే తీసుకురావాల్సిందే” అని ఓ తల్లి చెప్పిన మాటలు, గ్రామస్థుల అసహాయతకు అద్దం పడుతున్నాయి.

### వంకర రోడ్లపై వణుకుతున్న అడుగులు

నీటి కోసం కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వచ్చే ఈ ప్రయాణం, చిన్నపిల్లలకు కష్టమైతే... 70 ఏళ్ల వృద్ధులకు అది ఒక శిక్షలా మారింది. ఒక వృద్ధుడు హృదయ విదారకంగా, “నీళ్లు తీసుకురాకపోతే మనం బతకలేం కానీ ఈ కాళ్లు నన్ను ఎంతకాలం మోయగలవో దేవుడికే తెలుసు” అని చెప్పారు. ఈ మాటలు నీటి కొరత ఎంత మానవీయ దారుణానికి దారితీస్తుందో సాక్ష్యంగా నిలుస్తాయి. మరమ్మతులకు ఎంత సమయం పట్టినా, గ్రామాల ప్రాణాలు బతకడానికి ట్యాంకర్లు వెంటనే పంపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నీరు ఒక రోజు రాకపోతే సమస్య కాదు కానీ ఏడాది రాకపోతే అది మానవత్వంపై చేసిన నేరం! అని గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రామాలు తాగునీరు కోరుతున్నాయి. భిక్షం కాదు. జీవించే హక్కు కోరుతున్నాయి. అధికారులు ఎంత త్వరగా స్పందిస్తే అంత మంది ప్రాణాలు రక్షించబడతాయి. కేసిరెడ్డిపల్లిలో నీటి బొట్టు కోసం పడుతున్న ప్రతి అడుగు... మనసును కదిలించే అత్యవసర మానవీయ పిలుపు.

**ఖమ్మం బ్యూరో, మహా:** నీరు అంటే జీవం. నీరు అంటే ఆశ. నీరు అంటే మనిషి బతుకు. కానీ ఖమ్మం జిల్లాలోని కేసిరెడ్డిపల్లి, కచవరం, కొత్తపాలెం వంటి ఆరు గ్రామాల ప్రజలకు మాత్రం నీరు ఒక నిత్య పోరాటంగా, ఒక ఆవేదనగా మారిపోయింది. ఇంటింటికీ ప్రవహించాల్సిన మిషన్ భగీరథ సురక్షిత నీరు ఏడాది నుంచి రావడం లేదు. ప్రస్తుతం వారి భాగ్యం..మూగజీవాలు కూడా తాగడానికి ఇష్టపడని ఉప్పునీరు, క్లోరైడ్ రసాయనాలతో కూడిన కలుషిత నీరు మాత్రమే. గర్భిణీలు, చిన్నారులు, వృద్ధులు భయంకరమైన ఆరోగ్యపరమైన భయంతో జీవిస్తుంటే, అధికారులు మాత్రం ఈ మానవీయ సంక్షోభంపై నిశ్శబ్దంగా నిలబడిపోయారు. తాగునీటి కోసం ప్రతి అడుగులోనూ కనిపించే ఈ వేదనను ఇక మరింత కాలం చూడలేమని ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### కిలోమీటర్ల నడకతో మొదలయ్యే ఉదయం కథ

కేసిరెడ్డిపల్లిలో ప్రతి ఇంటి ఉదయం ఖాళీ డబ్బాలతోనే మొదలవుతుంది. పాఠశాలకు వెళ్లాల్సిన పిల్లలు, పనికి వెళ్లాల్సిన పెద్దలు..అందరూ ముందుగా చేయాల్సింది నాలుగు కిలోమీటర్ల దూరం నడిచి నీరు తెచ్చుకోవడమే. తాగడానికి, వండడానికి సరిపోయే కొద్దిపాటి నీరు దక్కాలంటే కిలోమీటర్ల దూరం నడిచి, గంటల తరబడి నిరీక్షించక తప్పదు. ఒక తల్లి ముఖంలో అలసట, చేతుల్లో బరువు, గుండెల్లో పిల్లల ఆరోగ్యపరమైన భయం.. ఈ అన్నీ ప్రతి ఇంటి నిత్యజీవితం. జీవనోపాధి కన్నా తాగునీరు కోసమే ఇక్కడ పెద్ద పోరాటం చేయాల్సిన దుస్థితి నెలకొంది.

### ఉప్పునీరు- కన్నీరుగా మారిన నీటి బొట్లు

ఇంట్లో లభ్యమయ్యే నీటి ముద్దు నోటిలో వేసుకుంటే మొదటి రుచే చేదు. ఉప్పుతనం, క్లోరైడ్ దుర్వాసనతో కూడిన ఈ నీరు..మనుషులు తాగాల్సిన పరిస్థితి ఎంత దారుణమో తెలియజేస్తుంది. ఒక యువ గర్భిణీ వేదనతో “పాపకు పాలు ఇవ్వాలి%ొ% కానీ నేను తాగే నీరే విషమై ఉంటే, నేను ఎలా బతుకుతాను?” అని కన్నీటిపర్యంతమైంది. చిన్నపిల్లల చేతులు, కాళ్లపై వచ్చే చర్మవ్యాధులు, మడతల్లో పుట్టే దురదలు, కీళ్ల నొప్పులతో విలవిలలాడే పెద్దలు.. ఇవన్నీ నీటి లోపం వల్ల, కలుషిత నీటి తాగుడు వల్లే ఎదురయ్యే విరచ్చిన బాధలు.

### మిషన్ భగీరథ వైఫల్యం

ఇనగాలి..రాజుదేవర్లపాడు.. కట్లేరు మధ్య ఉన్న మిషన్ భగీరథ పైపులైన్ జాయింట్ ఏడాది నుంచి పాడైపోయినా, సంబంధిత శాఖలు కనీసం స్పందించడానికి కూడా సిద్ధంగా లేవు. ఇది ప్రభుత్వ పథకం యొక్క ఘోర వైఫల్యాన్ని సూచిస్తుంది. గ్రామస్తుల ఆవేదన ప్రకారం, “మన ఆరోగ్యం కంటే విలువైనదేమీ లేదు. కానీ అధికారులకు ఇది కేవలం ఉద్యోగం, మన బాధలు వినడం వారి బాధ్యత కాదు అన్నట్టున్నారు.”

# నిరుద్యోగులకు వరం మెగా జాబ్ మేళా

- సద్వినియోగం చేసుకోండి
- ఉపాధితో కుటుంబాలకు భరోసాగా ఉండాలి
- ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్
- జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరణ

**కొత్తగూడెం రూరల్, మహా:** కొత్తగూడెం క్లబ్బులో ఈనెల 16వ తేదీన జరిగే మెగా జాబ్ మేళాను జయప్రదం చేయాలని ఈ జాబ్ మేళా నిరుద్యోగులకు వరమని భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ అన్నారు. శనివారం చుంచుపల్లి మండలంలోని సారయ్య కాలనీలో గల సంఘ కార్యాలయంలో ఈ మెగా జాబ్ మేళా పోస్టర్లను ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ తన సంఘ సభ్యులతో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మెగా జాబ్ మేళాలో ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు డిగ్రీ నుండి పోస్టు గ్రాడ్యుయేషన్ చేసిన అభ్యర్థులకు బీటెక్ ఎంటెక్ ఎంబీఏ కంప్యూటర్ సైన్స్ చేసిన అభ్యర్థులకు అంతేకాకుండా ఐటిఐలో వివిధ ట్రేడ్ లను చేసిన అభ్యర్థులకు వారి ప్రతిభను బట్టి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అంతేకాకుండా చెవిటి మూగ దివ్యాంగులకు ట్రాన్స్ జెండర్ ల కూడా ఈ యొక్క జాబ్ మేళాలో అవకాశం కల్పించబడుతుందని చెప్పారు. ఇంతటి గొప్ప మెగా జాబ్ మేళా కొత్తగూడెంలో ఇప్పటివరకు జరగలేదని తెలిపారు. కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అవిరల కృషితో



చొరవతో ఉపముఖ్యమంత్రి అభివృద్ధికి మార్గదర్శకులు మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఉమ్మడి జిల్లాల పార్లమెంటరీ సభ్యులు రామ సహాయం రఘురామారెడ్డి ఆశీస్సులతో జాబ్ మేళా నిర్వహించబడుతుందన్నారు. సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అభ్యుదయవాది అభివృద్ధి సాధకుడు బలరాం నాయక్ సౌజన్యంతో ఉచిత మంచినీరు టిఫిను మధ్యాహ్నం భోజనం వసతి మొదలైన సౌకర్యాలన్నిటినీ ఏర్పాటు చేయడం జరిగిందని ఆయా రంగాలకు చెందిన నిరుద్యోగ అభ్యర్థులందరూ ఈ సువర్ణ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయగలరని విజ్ఞప్తి చేశారు. ఈ మెగా జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరణలో ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ తో పాటు తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పీక కృష్ణ, గాంధీ చారిటబుల్ ట్రస్ట్ జిల్లా అధ్యక్షులు చింతలచెరువు గిరీశం, రాష్ట్ర ఉపాధ్యక్షులు అపరబాలు అల్లి శంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కూర రవీందర్, రాష్ట్ర మహిళా నాయకురాళ్లు బడికల పుష్పలత రత్నకుమారి, లావణ్య, జిల్లా నాయకులు వరప్రసాద్, గిట్ల పురుషోత్తం, ఉండేటి సుధీర్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## సాంకేతికతతో వినియోగదారులకు మెరుగైన సేవలు

- 20 సేవలతో వినియోగదారులకు మరింత సౌలభ్యం
- కొత్త కనెక్షన్ మంజూరు ప్రక్రియను మరింత సులభతరం
- వాట్సాప్ చాట్‌బాట్ ద్వారా ఫిర్యాదుల నమోదు
- అత్యవసర పరిస్థితుల్లో 24/7 సేవ
- సూపరింటెండింగ్ ఇంజనీర్ జి. మహేందర్



**ఖమ్మం , మహా:** ఖమ్మం సర్కిల్ పరిధిలో విద్యుత్ వినియోగదారులకు మరింత వేగవంతమైన, పారదర్శకమైన సేవలందించేందుకు తాము ఆధునిక సాంకేతికతను విస్తృతంగా వినియోగిస్తున్నామని సూపరింటెండింగ్ ఇంజనీర్ జి. మహేందర్ తెలిపారు. వినియోగదారులకు సౌకర్యంగా ఉండే విధంగా అనేక డిజిటల్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చామని ఆయన పేర్కొన్నారు.

### టీజీఎన్‌పీడీసీఎల్ మొబైల్ యాప్..

వినియోగదారులు తమ ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్ లేదా ఐఫోన్‌లో టీజీఎన్‌పీడీసీఎల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఇరవై రకాల సేవలను పొందవచ్చని తెలిపారు. యాప్‌లో సంఘటన నివేదిక, ఫిర్యాదు నమోదు, ఫిర్యాదు స్థితి ట్రాకింగ్, రీ–ఓపెన్ సౌకర్యం, స్వీయ మీటర్ రీడింగ్, బిల్లు చెల్లింపు, బిల్లు చరిత్ర, ఆన్‌లైన్ చెల్లింపు చరిత్ర, కొత్త కనెక్షన్‌కు సంబంధించిన దశల వారీ వివరాలు, ఆధార్–మొబైల్ లింక్, గృహ బిల్లు లెక్కించే సదుపాయం, వినియోగ మార్పులు, విద్యుత్ వినియోగ సూచనలు, టారిఫ్ వివరాలు, విద్యుత్ పొదుపు సూచనలు, భద్రత సూచనలు, ఫీడ్‌బ్యాక్, మై అకౌంట్ వివరాలు, వినియోగదారుల బిల్లు సమాచారం, పరిధి అధికారులు వివరాలు, సంప్రదింపు సౌకర్యం వంటి ఫీచర్లు ఉన్నాయని వివరించారు.

### కొత్త కనెక్షన్ మంజూరు ప్రక్రియను మరింత సులభతరం...

కొత్త విద్యుత్ సేవలను మంజూరు చేసే విధానాన్ని పూర్తిగా డిజిటల్ చేయడంతోపాటు, వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వ్యవస్థను రూపొందించామని మహేందర్ తెలిపారు. దరఖాస్తులో చిన్నపాటి లోపాలు ఉన్నా తిరస్కరించకుండా మరో అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. దరఖాస్తు నమోదు నుంచి సేవ మంజూరు వరకూ ప్రతి దశలో వినియోగదారునికి ఎస్‌యంఎస్ ద్వారా సమాచారం చేరేలా ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. కొత్తగా అందించిన ట్రాకింగ్ సిస్టమ్ ద్వారా దరఖాస్తుదారు తన అప్లికేషన్ నంబర్‌ను ఉపయోగించి టీజీఎన్‌పీడీసీఎల్ వెబ్‌సైట్ లేదా యాప్ ద్వారా దశల వారీ స్థితిని సులభంగా తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

### వాట్సాప్ చాట్‌బాట్ ద్వారా ఫిర్యాదుల నమోదు...

విద్యుత్ వినియోగదారులు వాట్సాప్ చాట్‌బాట్ ద్వారా కూడా తమ విద్యుత్ సమస్యలను తెలపవచ్చని మహేందర్ తెలిపారు. మొబైల్ నుండి నిర్ణీత నంబరుకు 'హాయ్' సందేశం పంపగానే చాట్‌బాట్ ఫిర్యాదు నమోదు, ఫిర్యాదు ట్రాకింగ్, ఏజెంట్‌తో చాట్ వంటి సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని వివరించారు. యూనిక్ సర్వీస్ నంబర్ ఉన్నా-లేకపోయినా ఫిర్యాదు నమోదు చేసే విధానాన్ని అమలు చేస్తున్నట్టు చెప్పారు.

### రైతులకు వ్యవసాయ ఎస్టిమేట్ కాపీలు తెలుగులో

**వ్యవసాయ సేవలకు సంబంధించిన ఎస్టిమేట్‌లు పూర్తిగా తెలుగులో అందిస్తున్నామని మహేందర్ తెలిపారు. మెటీరియల్స్ జాబితా, నక్ష (స్కెచ్), ఇతర సాంకేతిక వివరాలు రైతులకు అర్థమయ్యే రీతిలో అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. ఎస్టిమేట్‌కు సంబంధించిన వివరాలు రైతులకు వచ్చే ఎస్‌యంఎస్‌లో ఇచ్చిన లింక్ ద్వారా చూడవచ్చని తెలిపారు. ఎస్‌యంఎస్ సందేశాలు కూడా పూర్తిగా తెలుగులో పంపుతున్నట్టు వివరించారు.**

## గ్రామ పరిపాలనలో మహిళలు ముందంజలో ఉండాలి

**బోనకల్, మహా న్యూస్:** గ్రామ పరిపాలనలో మహిళలు ముందంజలో ఎలక్షన్ కార్యక్రమంలో పాల్గొనాలని రెండు రోజులు శిక్షణా కార్యక్రమం జరిగింది ఈరోజు మొదటి రోజు శిక్షణలో భాగంగా, బోస్కో సేవా కేంద్ర , హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో పరిపాలన అభివృద్ధిలో మహిళా పాత్ర అనే అంశంపై గ్రామస్థాయిలో ఎలక్షన్లో పాల్గొననున్న మహిళ నాయకులను అవగాహన సదస్సును , గోవిందాపురం ఏఎల్సి సెంటర్ వేదిక లో నిర్వహించడం జరిగింది. పరిపాలన అభివృద్ధిలో మహిళా పాత్ర పై రాబోవు పంచాయతీ ఎలక్షన్లో మహిళా పాత్ర పై అవగాహన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రీజనల్ కోఆర్డినేటర్ సోడా బత్తిన అంబేద్కర్ మాట్లాడుతూ పరిపాలన అభివృద్ధిలో మహిళా పాత్ర పై వివరించారు పురుషులు మహిళలతో సమానంగా అభివృద్ధి చెందుతూ



గ్రామస్థాయిలో పరిపాలనలో కూడా మహిళలు ఎదగాలని చెప్పి ఆకాంక్షించారు అంతేకాకుండా ఎఫెక్ట్ సంస్థ ప్రతినిధి సురేష్ గారికి రిసోర్స్ పర్సన్ గా వ్యవహరిస్తూగుడ్ గవర్నెన్స్ , నాయకత్వ లక్షణాల పైన అవగాహన కల్పించి ముఖ్యంగా మహిళలు రాజకీయ రంగంలో పైకి రావడానికి పురుషుల పాత్ర కూడా ముందు ఉంటుందని దీంట్లో పురుషులు కూడా సహకరించాలని కోరారు, గ్రామస్థాయిలో రాజకీయంలో మహిళలు పాల్గొని వారి యొక్క ప్రాథమిక హక్కులు విధులు భంగం కలగకుండా మహిళలు ముందుకు వెళ్లే విధంగా పురుషులు వారికి తోడ్పాటు అందించాలని చెప్పి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కే కరుణ ఎఫర్ట్ కోఆర్డినేటర్, లక్ష్మీకాంతం మాస్ డైరెక్టర్, బి ఎస్ కే ప్రతినిధులు జై శిరీష, గోపి బోనకల్ మాజీ ఎంపీపీ శ్రీమతి పాల్గొన్నారు.

# రైతుకు భరోసా కల్పిస్తున్న ప్రభుత్వం

**కారేపల్లి, మహా:** రైతుకు అన్ని విధాల సహకరిస్తూ రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం భరోసా కల్పిస్తుందని కారేపల్లి సోసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు అన్నారు. శనివారం కారేపల్లి మండలం మాధారంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సోసైటీ పాలకవర్గం ప్రారంభించింది. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ద్వారా రైతుకు గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. మొక్కజొన్న పంట అధికంగా పండిస్తున్న మాధారం ప్రాంతంలో కొనుగోలు కేంద్రం కావాలని సోసైటీ పాలకవర్గం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ దృష్టి తెచ్చి ఎమ్మెల్యే సహకారంతో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సింగరేణి మండలంలో విశ్వనాథపల్లి, మాధారం, ఎర్రబోడు, సింగరేణి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు సైతం ఐకేపీ, సోసైటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వరి ధాన్యంకు రూ.500 బోనస్ ఇస్తుందన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో సోసైటీ ఉపాధ్యక్షులు దారావత్ మంగీలాల్, డైరక్టర్లు అడ్డగోడ ఐలయ్య, కొత్తూరి రామారావు, కార్యదర్శి బల్లు హనుమంతరావు, ఏఈవో చంద్రకళ, మాజీ ఎంపీటీసీ భాగం రూపా నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ అజ్మీర నరేష్, రైతు ప్రతినిధులు బానోత్ రాంమూర్తి , కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు కిలారి అప్పారావు, రైతు నాయకులు బానోత్ రాంమ్మూర్తి, ఇమ్మడి తిరుపతిరావు, రైతులు భాగం వెంకటప్పారావు, భాగం నాగేశ్వరరావు, కాసాని లక్ష్మినారాయణ, పాపినేని నాగేశ్వరరావు, అంగోత్ మత్రు, రఘు, మంకిన్ని చిన్న సైదయ్య, పిల్లలమర్రి వీరన్న, జాటోత్ వీరన్న, కుర్ర శ్రీను, గుర్రం నర్సింహరావు, తొగరు శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## ప్రధానమంత్రి జీవనజ్యోతి భీమా చెక్ అందజేత

**కారేపల్లి, మహా :** కారేపల్లి మండలం పోలంపల్లినాగయ్యగుంపుకు చెందిన పొడుగు శేషగిరి కుటుంబానికి ప్రధాన మంత్రి జీవనజ్యోతి భీమా యోజన రూ. 2లక్షల చెక్‌ను తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ తోటకూరి రాము శనివారం అందజేశారు. మృతుడు పొడుగు శేషగిరి టీజీబీలో రూ.436 తో పీఎంజేజేబీవై పాలసీ తీసుకోవటంతో అతని కుటుంబానికి భీమా సొమ్ము రూ.2లక్షలు చెల్లించారు. ఈసందర్భంగా మేనేజర్ రాము మాట్లాడుతూ బ్యాంకు ఖాతా ఉన్న ప్రతి ఒక్కరు తప్పని సరిగా ప్రమాద భీమా, సాధారణ భీమా చేయించుకోవాలని సూచించారు. పంట రుణాలు తీసుకున్న రైతులు తప్పని సరిగా పంట రుణాలు రెన్యూవల్ చేసుకోవాలన్నారు. రెన్యూవల్ చేసుకోవటం ద్వారా ప్రభుత్వం నుండి 3శాతం వడ్డీ రాయితీ లభిస్తుందన్నారు.



## ధాన్యం అక్రమ రవాణాకు నియంత్రణకు చెక్ పోస్ట్

**ముదిగొండ,మహా:** ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ రాష్ట్రానికి అక్రమంగా ధాన్యం రవాణా కాకుండా చెక్ పోస్ట్ ఏర్పాటు చేయడం జరిగిందని పౌర సరఫరాల శాఖ డిటి విజయ్ బాబు తెలిపారు. శనివారం పౌర సరఫరాల శాఖ డిటి విజయ్ ముదిగొండ మండలం వల్లభి గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం చెక్ పోస్ట్ ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పౌర సరఫరాల శాఖ డిటి విజయ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సన్న వడ్లకు 500 రూపాయల బోనస్ ప్రభుత్వం అందిస్తున్న నేపథ్యంలో ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా ధాన్యం రవాణా జరుగుతుందని, దీనిని అరికట్టేందుకు జిల్లా సరిహద్దు వద్ద చెక్ పోస్ట్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఏపీ నుంచి అక్రమంగా ధాన్యం రవాణా చేయడానికి వీలు లేదని, 24 గంటల పాటు అధికారులు చెక్ పోస్ట్ వద్ద కాపలా కాస్తున్నారని, అక్రమంగా ధాన్యం రవాణా చేస్తే కేసులు నమోదు చేయడంతో పాటు వాహనం, ధాన్యం సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ తనిఖీలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## యువతి ఆత్మహత్య బాధ్యుడిని కఠినంగా శిక్షించాలి

**కారేపల్లి, మహా:** ప్రేమ పేరుతో యువతిని మోసగించి ఆత్మహత్యకు కారకుడ్కైన నామ నరేష్‌ను శిక్షించాలని పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి వై.జానకి డిమాండ్ చేశారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ రేలకాయలపల్లికి చెందిన జర్పల సందీప్తిని ప్రేమపేరుతో వంచించటమే కాక సోషల్ మీడియాలో పోటోలు పెట్టి బ్లాక్ మెయిల్‌కు పాల్పడటంతో పురువు పోయిందని తీవ్ర ఆవేదనతో పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిరదన్నారు. యువతి ఆత్మహత్యకు కారకుడ్కైన నామ నరేష్‌ను ఆరెస్టు చేయాలని, మృతురాలి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



## మాజీ సర్పంచ్ బోడకు నివాళ్లు ఆర్పించిన నేతలు

**కారేపల్లి, మహా:** సింగరేణి గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ బోడా మోహన్ కఅష్ణ సంస్మర కార్యక్రమం శనివారం కారేపల్లిలో జరిగింది. ఈకార్యక్రమానికి సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండెబోయిన నాగేశ్వరారు, మాచర్ల గోపాల్ లు హాజరైనారు. బోడ మోహన్ కృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు ఆర్పించారు. సింగరేణి గ్రామపంచాయతీకి ఉపసర్పంచ్, సర్పంచ్ ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు వజ్జా రామారావు, తలారి దేవప్రకాష్, ముండ్ల ఏకాంబరం, కరకపల్లి రాయమల్లు. కాంగ్రెస్ నాయకులు బానోత్ దేవ్లానాయక్, అడ్డగోడ ఐలయ్య, బీఆర్ఎస్ నాయకులు వాంకుడోత్ జగన్, డొంకెన రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



## నేడు మెగా జాబ్ మేళా..కొత్తగూడెం క్లబ్బులో ఏర్పాట్లు పూర్తి

**భద్రాద్రి బ్యూరో, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్థానిక కొత్తగూడెం క్లబ్లో ఆదివారం సింగరేణి సహకారంతో జరిగే జాబ్ మేళ ఏర్పాట్లను శనివారం పలువురు ప్రముఖులు పరిశీలించడం జరిగింది. కొత్తగూడెం నియోజకవర్గం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ఆధ్వర్యంలో కొత్తగూడెం ఏరియా సింగరేణి వారి సహకారంతో ఉదయం 9 గంటల నుండి ప్రారంభం అయ్యే "మెగా జాబ్ మేళా" ఏర్పాట్లను సింగరేణి డైరెక్టర్( ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) కే.వెంకటేశ్వర్లు, సి.పి.ఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్.కే సాభీర్ పాషాలు పరిశీలించిన అనంతరం వారు మాట్లాడుతూ నిరుద్యోగ యువత ఈ మెగా జాబ్ మేళా అవకాశాన్ని సద్వినియోగపరుచుకొని అధిక సంఖ్యలో కార్యక్రమానికి హాజరై జీవనభృతికి అవసరమైన ఉద్యోగాలను పొందుకోవాలన్నారు. ఈ జాబ్ మేళాలో పదవ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, ఇంజనీరింగ్, ఎంబీఏ, పీజీ, ఫార్మసీ వంటి అర్హతలతో 18 నుండి 40 ఏళ్ల వయస్సు గల యువతీ యువకులు పాల్గొనవచ్చని అభ్యర్థులు జాబ్ మేళాకు హాజరయ్యేటప్పుడు తమ ఒరిజినల్ సర్టిఫికేట్లు, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, వాటి జిరాక్స్ కాపీలు వెంట తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా జిఎం ఎం. షాలేం రాజుతో పాటు సి.పి.ఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్.కే సాభీర్ పాషా, డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్)కే.వెంకటేశ్వర్లు, ఎస్ఓటు జిఎం జివి కోటిరెడ్డి, ఎజిఎం(సివిల్) సిహెచ్.రామకృష్ణ, డిజిఎం(పర్సనల్) జీవి.మోహన్ రావు, డిజిఎం(ఐఈ)ఎన్.యోహాన్ ఇతర సంబంధిత కొత్తగూడెం కార్పొరేట్ అధికారులు పాల్గొన్నారు.





## మృతి చెందిన ఎస్ఎన్ కుమార్ కుటుంబానికి ఆర్ఎంపీల సాయం

**అశ్వారావుపేట, మహా:** ఇటీవల ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డ మొలల వైద్యుడు ఎస్ఎన్ కుమార్ కుటుంబాన్ని ఆదుకునేందుకు మండలంలోని ఆర్ఎంపీలు ముందుకు వచ్చారు. తమ వంతు బాధ్యతగా రూ.10 వేలను శనివారం కుమార్ భార్యకు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్ఎంపీలు మాట్లాడుతూ, సహచరుడి కుటుంబం ఆపదలో పడితే తోచినంత సహాయం చేయడం మా కర్తవ్యమని భావిస్తున్నాం అని పేర్కొన్నారు. కుమార్ కుటుంబానికి అందించిన ఈ సహాయంపై స్థానికులు ఆర్ఎంపీల సేవాభావాన్ని అభినందించారు.

## ప్రతీ మొక్కను కాపాడాల్సిందే

**నేలకొండపల్లి, మహా:** ప్రతీ మొక్కను కాపాడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరి పై ఉందని నేలకొండపల్లి ఎంపీడీవో యం.యర్రయ్య సూచించారు. మండలం లోని అప్పలనరసింహాపురం లోని నర్సరీ ని శనివారం పరిశీలించారు. సిబ్బంది కి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం ను నేరవేర్చేందుకు ప్రతీ ఒక్కరూ పాటుపడాలని సూచించారు. స్థానిక బ్లాక్ ప్లాంటేషన్ లో నాటిన 6 వేల మొక్కలను సంరక్షించాలని అన్నారు. ప్రతీ మొక్క కు పెన్సింగ్ ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.



## ముందస్తుగా డీఈఓ అనుమతి తప్పనిసరి



**నేలకొండపల్లి, మహా:** పాఠ్య పుస్తకాలు వచ్చాయి...అయితే విద్యార్థులు పోవాల్సిందే.... ఏకరూప దుస్తులు వచ్చాయి.... విద్యార్థులు ఉండాల్సిందే... మండల కేంద్రాలలో ఏమైనా కార్యక్రమాలు జరుగుతున్నాయంటే విద్యార్థులు రావాల్సిందే... కానీ ఇక నుంచి కుదరదు...డీఈవో అనుమతి లేకుండా విద్యార్థులను బయటకు తీసుకెళ్లితే...సదరు ప్రధానోపాధ్యాయుల పై చర్యలకు ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులను సంబంధిత జిల్లా అధికారుల అనుమతి లేకుండా బయటకు తీసుకెళ్తే చర్యలు తప్పవని ఉన్నతాధికారులు హెచ్చరించారు. కొందరు ప్రధానోపాధ్యాయులు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా విద్యార్థులను వివిధ అవసరాల లికోసం బయటకు పంపిస్తున్న విషయం పై పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం జిల్లాలోని ప్రాథమిక పాఠశాలలు-814, ప్రాథమికోన్నత పాఠశాలలు-191, ఉన్నత పాఠశాలలు-212 మొత్తం 1217 పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాల ప్రాంగణం నుంచి విద్యార్థులను బయటకు తీసుకెళ్లిన సందర్భంలో ఆవాంచనీయ సంఘటనలు జరుగుతుండటం పై ప్రభుత్వం అగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. విద్యార్థులను బయటకు పంపాలన్నా లేదా.. వారిని తీసుకుని వెళ్లాలన్నా ముందస్తు అనుమతి తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు (డీఎస్ఈ) డా. నవీన్ నికోలస్ ఉత్తర్వులు జారీ చేశారు.



## చిరాగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ వితరణ

**జూలూరుపాడు, మహా:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు ఇంటర్నేషనల్ ఎన్నారై సంస్థ చిరాగ్ ఫౌండేషన్ కొత్తగూడెం ఆర్గనైజింగ్ సెక్రటరీ పార్వతమ్మ, సంధ్యారాణి, శాంత కుమారి సహకారంతో 42 మంది విద్యార్థులకు సుమారు 12,000 రూపాయల విలువగల స్టడీ మెటీరియల్ ను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ స్టడీ మెటీరియల్ ను ఉపయోగించుకొని పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించాలని కోరారు. కష్టపడి చదువుకొని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగి, పాఠశాలకు, గురువులకు, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తేవాలని అన్నారు. ప్రతి ఒక్కరూ ఉన్నత విద్యను అభ్యసించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలలో స్థిరపడి మీరు కూడా మరో పదిమందికి సహాయాన్ని అందించాలని కోరారు. విద్యార్థులకు ఉపయోగకరమైన స్టడీ మెటీరియల్ ను అందజేసిన చిరాగ్ ఫౌండేషన్ సంస్థకు పాఠశాల ఉపాధ్యాయ బృందంతో పాటు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి లక్ష్మీనరసయ్య, సీనియర్ సహాఉపాధ్యాయులు రామశెట్టి శ్రీనివాసరావు, నిమ్మగడ్డ ఉమా, నంద్రు గురుమూర్తి, గుడిపూడి వెంకటేశ్వర్లు, ఉమా మహేశ్వరి, లలితా, అరుణకుమారి, బోడా కృష్ణ, ప్రతాపరెడ్డి, ఉదయ సేత్, ఉపేంద్రమ్మ పాల్గొన్నారు.



# ఆదివాసీ హక్కుల సాధనలో అగ్రగామి

- ఆదివాసీల ఆరాధ్య దైవం బిర్సా భగవాన్
- మోదీ సర్కార్ చారిత్రక నిర్ణయమే జన్జాతీయ గౌరవ్ దివస్
- ఘనంగా బిర్సా ముండా 150వ జయంతి వేడుకలు
- బిజెపి జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు



**ఖమ్మం, మహా:** గిరిజన యోధుడు, స్వాతంత్ర్య సమరయోధుడు భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా ఆయన పోరాట స్ఫూర్తిని ఖమ్మం లో స్మరించుకుంది. ఆదివాసీ హక్కుల సాధనలో బిర్సా ముండా అగ్రగామిగా నిలిచారని, ఆయన జీవితం యావత్ దేశానికి ఆదర్శప్రాయమని బిజెపి జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం బిజెపి జిల్లా కార్యాలయంలో నిర్వహించిన 'జన్జాతీయ గౌరవ్ దివస్' వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న నెల్లూరి కోటేశ్వరరావు, భగవాన్ బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.బిర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకుని, దేశవ్యాప్తంగా ఆదివాసీల హక్కుల కోసం ఆయన చేసిన త్యాగాన్ని స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని నెల్లూరి అన్నారు. ఆయన ధైర్యం, ఆదర్శాలు ప్రతి ఒక్కరిలో స్ఫూర్తి నింపాలని, సామాజిక న్యాయం కోసం ఆయన పోరాటాన్ని గుర్తుంచుకోవాలని పిలుపునిచ్చారు. బిర్సా ముండా 1875 నవంబర్ 15న నేటి జార?ండ్ రాష్ట్రంలోని ఉలిహతు గ్రామంలో జన్మించారు. ఆయన 19వ శతాబ్దపు చివరిలో బ్రిటిష్ పాలనలోని అటవీ చట్టాలు, వడ్డీ వ్యాపారుల దోపిడీకి వ్యతిరేకంగా చారిత్రకమైన 'ఉల్గులాన్' (మహోన్నత తిరుగుబాటు) ఉద్యమానికి నాయకత్వం వహించారని కోటేశ్వరరావు వివరించారు. ఈ ఉద్యమం అణచివేతకు వ్యతిరేకంగా గిరిజన సమాజం చేసిన చారిత్రక పోరాటంలో మైలురాయిగా నిలిచిందని పేర్కొన్నారు. ఆదివాసీల భూమి, భుక్తి, విముక్తి (జల్, జంగిల్, జమీన్) కోసం కేవలం 25 ఏళ్ల చిన్న వయసులోనే తన ప్రాణాలను అర్పించి, ప్రజల హక్కుల కోసం జీవితాన్ని అంకితం చేసిన ధైర్యశాలి ఆయన. ఆయన అసాధారణ త్యాగం, తెగువ కారణంగా ఆదివాసీలు ఆయన్ని కేవలం నాయకుడిగా కాక బిర్సా భగవాన్ గా ఆరాధిస్తున్నారని తెలిపారు. ఉద్యమ చరిత్రలో బిర్సా ముండా పేరు స్ఫూర్తిదాయకమైన నాయకుడిగా చిరస్థాయిగా నిలిచిపోతుందని కొనియాడారు. స్వాతంత్ర్య పోరాటంలో గిరిజన యోధుల సహకారం, త్యాగాలు తరతరాలుగా చరిత్రలో సముచిత స్థానం దక్కక నిర్లక్ష్యానికి గురయ్యాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అన్యాయాన్ని సరిదిద్దుతూ, బిర్సా ముండా సేవలకు గుర్తింపుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం నవంబర్ 15ను 'జన్జాతీయ గౌరవ్ దివస్ గా ప్రకటించడం యావత్ దేశానికే, ముఖ్యంగా గిరిజన సమాజానికి గర్వకారణమని వివరించారు. బిజెపి ప్రభుత్వం గిరిజన సంస్కృతి, వారసత్వాన్ని పరిరక్షించడానికి, వారి అభ్యున్నతి కోసం అధిక ప్రాధాన్యత ఇస్తోంది. పీఎం-జన్మన్ (ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్) వంటి చారిత్రక పథకాలతో వేల కోట్ల రూపాయలు కేటాయించి, గిరిజన వర్గాల అభివృద్ధిని జాతీయ అభివృద్ధిలో అంతర్భాగం చేస్తోందని కోటేశ్వరరావు స్పష్టం చేశారు. ఈ విధంగా బిజెపి గిరిజన గౌరవాన్ని, సాధికారతను పెంచుతూ, నూతన శకానికి నాంది పలికిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నలగట్టు ప్రవీణ్ కుమార్, రవి రాథోడ్, దొడ్డ అరుణ, పమ్మి అనిత, అల్లిక అంజయ్య, జ్వాల నరసింహారావు,మంద సరస్వతి, చిన్న కృష్ణ,కందుల శ్రీకృష్ణ, మోహన్ రాథోడ్, రుద్ర గాని మాధవ్, బోయినపల్లి సురేష్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండండి

**మధిర, మహా:** మధిరలో జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక లోక్ అదాలత్ కార్యక్రమంలో 1211 కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కారం అయ్యాయని న్యాయమూర్తి దీప్తి వేముల అన్నారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ, ప్రజల్లో వేగంగా పెరుగుతున్న సైబర్ నేరాలపై అప్రమత్తత అత్యవసరం అని గట్టిగా స్పష్టం చేశారు. డిజిటల్ యుగంలో వ్యక్తిగత భద్రత, ఆన్‌లైన్ జాగ్రత్తలు, ఫిర్యాదు విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన తక్షణ అవసరాన్ని ఆమె హైలైట్ చేశారు. ముఖ్యంగా



గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన లోపం కారణంగా ప్రజలు సులభంగా మోసపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఫిషింగ్, ఆన్‌లైన్ మోసాలు, డేటా చోరీ, బ్యాంకింగ్ మోసాలు, సామాజిక మాధ్యమ మోసాలు విస్తృతంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి పౌరుడు డిజిటల్ భద్రతపై కనీస అవగాహన తప్పనిసరిగా అలవర్చుకోవాలని ఆమె సూచించారు. తెలియని లింకులు క్లిక్ చేయడం, తెలియని నంబర్లకు స్పందించడం, ఓటీపీ వివరాలు పంచుకోవడం అత్యంత ప్రమాదకరమని ఆమె స్పష్టం చేశారు. యూపీఐ లావాదేవీల పేరుతో భారీగా మోసాలు జరుగుతున్నాయని, వ్యక్తిగత సమాచారం ఏ పరిస్థితుల్లోనూ ఇతరులకు ఇవ్వకూడదని ఆమె ప్రజలకు అవగాహన కల్పించారు.

# పచ్చని పంటలతో సస్యశ్యామలం అవ్వాలి

**ఖమ్మం,మహా:** ఇతర పంటల సాగుకు ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ సాగు చేపట్టాలని, ఆయిల్ పామ్ సాగుతో రైతులకు మంచి ఆదాయం వస్తుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. శనివారం మంత్రి తుమ్మల నాగేశ్వర రావు రఘునాథపాలెం మండలంలో పర్యటించారు. మంచుకొండ గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతుబజార్ కూరాగాయల మార్కెట్ ను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమీషనర్ సునీల్ దత్ లతో కలిసి ప్రారంభించారు. రైతుబజార్ లో మహిళా రైతులతో మంత్రి ముచ్చటిస్తూ తాజా ఆకుకూరలు, వివిధ రకాల కూరగాయలను నాణ్యమైనవి అమ్ముకోవాలని, మీరు పండించిన వాటిని నేరుగా సరసమైన ధరకే విక్రయించాలని, కొనేవారికి, మీకు నష్టం రాకుండా చూసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ మళ్లీ మంత్రిగా అవకాశం కల్పించిన ప్రజలకు మంచి పనులు చేయడమే తన బాధ్యత అని అన్నారు. ఉమ్మడి జిల్లాలలో అన్ని మండలాల్లో పంటలకు సాగునీరు అవకాశాలు కల్పించానని, ఇక రఘునాథపాలెం మండలం కు రాబోయే రోజులో 100 కోట్ల నిధులు తెచ్చి ప్రజల సహాకారంతో పంటలతో పచ్చబడే మండలంగా



ఉండే విధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. గోదావరి నీళ్ల సీతారామ ద్వారా, బుగ్గవాగు తో రైతుల పంటలు సస్యశ్యామలం అవుతాయని అన్నారు. అయిల్ పామ్ పంట సాగుతో రైతులకు తక్కువ పెట్టుబడి, దీర్ఘకాలం లాభాలు ఉంటాయని అన్నారు. మొక్కలు డ్రిప్ సబ్సిడి సాయం నుండి పంట ఎక్కువ లాభంతో కొనేవరకు నేను భరోసా ఉంటానని తెలిపారు. పామాయిల్ సాగు తో రైతులకు మహర్దశ పట్టనుందని మంత్రి తుమ్మల వెల్లడించారు. ఇతర పంటల కంటే పామాయిల్ కు ఆదాయం ఎక్కువని ఆకాలవర్షాలు, రాళ్ళవానలు, ఎలకలు, చీడపీడల వల్ల ఇబ్బందులు రావని, కోతులు, అడవి పందుల భయం ఉండదని, మందులు, సాగు ఖర్చు తక్కువని తెలిపారు. 3 సంవత్సరాల క్రితం పంట వేసిన రైతులకు నేడు పంట దిగుబడి ప్రారంభమైందని, దీనిని పరిశీలించి ఇతర రైతులు కూడా ఆయిల్ పామ్ పంట వైపు దృష్టి సారించాలని అన్నారు. మంత్రి అంతకుముందు మంచుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నూతనంగా నిర్మించిన అసుపత్రి సందర్శకుల విశ్రాంతి మందిరంను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, పంచాయతీ రాజ్ ఇఇ మహేష్ బాబు, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ ఆధ్వర్యంలో 19న ఆందోళనకు పిలుపు

### బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు

**పినపాక, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా రహదారులు దెబ్బతిని అధ్వాన స్థితికి చేరుకున్న నేపథ్యంలో ఈ నెల 19న అన్ని మండల కార్యాలయాల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు వినతిపత్రాలు అందజేయాలని జిల్లా అధ్యక్షుడు రేగ కాంతారావు పిలుపునిచ్చారు. శనివారం ఆయన మణుగూరు లో మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యేలు, స్థానిక నాయకులు తమ ప్రాంతాల్లో కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆయన సూచించారు.



## ప్రీటెస్ట్ జన గణన

**పినపాక,మహా:** సాంకేతిక పరిజ్ఞానంతో ప్రీటెస్ట్ (ముందస్తు పరిశీలన సర్వే) జన గణనను తహశీల్దార్ గొంది గోపాలకృష్ణ ఈ బయ్యారం, పినపాక, తోగుడెం గ్రామాలలో .పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2027లో నిర్వహించే జన గణన కోసం ముందస్తు సర్వే నిర్వహించేందుకు దేశ వ్యాప్తంగా నాలుగు చార్జెస్ మండలాలను ఎంపిక చేయగా, ఇందులో పినపాక మండలం ఒకటన్నారు. ముందస్తు సర్వే పూర్తిగా డిజిటలైజేషన్ ద్వారా జరుగుతుందన్నారు. గతంలో జన గణన మ్యాప్‌ల ద్వారా జరిగేదన్నారు. ప్రస్తుతం డిజిటల్ లేఅవుట్, హెచ్ఎల్‌వో యాప్ ద్వారా చేస్తున్నట్టు తెలిపారు. ఈ సర్వే కోసం ఈ ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు శిక్షణ పూర్తి చేసామని తెలిపారు. శిక్షణ పొందిన ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు ఈ నెల 15(శనివారం) నుంచి 30 వరకు ఎంపిక చేసిన గ్రామాల్లో ప్రతి ఇంటిని సందర్శించి జియో ట్యాగింగ్ చేస్తున్నారని తెలిపారు. జియో ట్యాగింగ్ చేసిన ఇంట్లోని వసతుల వివరాలను నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టాటిస్టికల్ డిప్యూటీ డైరెక్టర్ డి సుబ్బరాజు , స్టాటిస్టికల్ ఆఫీసర్ సిహెచ్ సతీష్, కుమారి హిమవర్ష, కుమారి హరిత, ఏ వినయ్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.



## ఈనెల 17న ఖమ్మం గ్రానైట్ యూనియన్ ఎన్నికలు

**ఖమ్మం సిటీ, మహా:** ఖమ్మం గ్రానైట్ మార్కర్ యూనియన్ కొత్త పాలకవర్గం ఎన్నికలను ఈ నెల 17వ తేదీ నిర్వహిస్తున్నారు. ప్రస్తుత కమిటీ పదవీకాలం పూర్తి కావడంతో, మధ్యాహ్నం 12 గంటలకు ఎన్నికలు జరుగుతాయి. సభ్యులందరూ తప్పకుండా వచ్చి ఓటు వేయాలని యూనియన్ కోరింది. ఎన్నికలతో పాటు, అదే రోజున కార్తీక వనభోజనాలు కూడా ఏర్పాటు చేస్తున్నారు. యూనియన్ సభ్యులు, కార్మికులు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూనియన్ విజ్ఞప్తి చేసింది. యూనియన్ గౌరవ సలహాదారు నరేంద్ర , అధ్యక్షులు వెంపటి ఉపేంద్ర తెలియజేశారు.

## నగర ప్రధాన సమస్యల పరిష్కారానికి చర్యలు



**ఖమ్మం, మహా:** ప్రశాంతమైన ఖమ్మం కోసం ప్రజాప్రభుత్వ పనిచేస్తుందని, నగరంలోని ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. మంత్రి శనివారం స్థానిక 49 డివిజన్ మామిళ్ళగూడెం లో మున్సిపల్ సాధారణ నిధులు 247 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. స్థానికంగా ఉన్న వృద్దురాలిని మంత్రి అప్యాయంగా పలకరిస్తూ పింఛను వస్తుందా, సన్యబియం ఇస్తున్నారా అని ఆరా తీసారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ ఖమ్మం నగరాభివృద్ధి లో నా శక్తి వంచన లేకుండా పనిచేస్తూ, పది కాలాల పాటు నాణ్యత ఉండేలా భవిష్యత్ తరాలకు ఉపయోగ పడేలా అభివృద్ధి ఉంటుందని అన్నారు. పెరుగుతున్న జనాభాకు తగ్గట్టుగా పట్టణంలో మౌలిక సదుపాయాలు కల్పనకు నిధులు కేటాయిస్తామని తెలిపారు. ప్రజా భాగస్వామ్యం తోనే పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి అని అన్నారు.

## బస్సు ప్రమాదంపై విచారణ చేపట్టిన ఈ బయ్యారం సీఐ



**పినపాక ,మహా:** పినపాక మండలం పాండురంగాపురం గ్రామంలో ఆర్టీసీ బస్సు , ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంపై ఈ బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు విచారణ చేపట్టారు. శనివారం ఈ బయ్యారం ఎస్సై సురేష్ తో కలిసి ప్రమాదవ స్థలాన్ని మరోమారు పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును పరిశీలించడమే కాక స్థానికులను అడిగి వివరాలు రికార్డు చేశారు. పక్కనే లింకింగ్ రోడ్డు ఉండడంతో లింక్ రోడ్ నుంచి వచ్చే ప్రయాణికులు ప్రధాన రహదారి గుండా వచ్చే వాహనాలను గమనించకుండా అదే వేగంతో రావడంతో ప్రమాదం జరుగుతుందని తెలియజేశారు. కావున లింక్ రోడ్డు దాటేటప్పుడు ఇప్పటిదాకా రహదారిని పరిశీలించి రహదారి దాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ హెడ్ కానిస్టేబుల్ దిలీప్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పీఎం ఆవాస్ యాప్ ఆన్లైన్ ప్రక్రియ పరిశీలించిన ఎంపీఓ

**పినపాక,మహా:** పేదలు, ఆర్థికంగా బలహీన వర్గాలకు గృహాలను అందించడం లక్ష్యంగా పీఎం ఆవాస్ యాప్ లో ఆన్లైన్ చేస్తున్నామని పినపాక ఎంపీఓ వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం ఆయన పినపాక మండల పరిధిలో చెగర్శల, దుగినేపల్లి , జానంపేట, పాండురంగాపురం గ్రామపంచాయతీలో ఆయా గ్రామ సెక్రెటరీ తో కలిసి పర్యటించి అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పీఎం ఆవాస్ యాప్ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా, అర్హత కలిగిన లబ్ధిదారులను గుర్తించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం దుగినెపల్లి, జానంపేట జిపి లలో నర్సరీ ఇలాంటి పరిశీలించారు. రోడ్డు ఇరువైపులా పిచ్చి మొక్కల తొలగింపు కార్యక్రమాన్ని జానంపేటలో పరిశీలించారు. చెగర్శల గ్రామంలో డంపింగ్ యార్డ్ పరిశీలించారు. సెక్రటరీలు తమ విధులలో అలసత్వం వహించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీలు ఖాజా హుస్సేన్, ఆదినారాయణ, సాంబశివరావు, అశోక్, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

